# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **వచ్చే రెండేళ్లలో రాష్ట్రాన్ని వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ వెల్లడించారు.**

**2.** **క్రైస్తవ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్ల రూపాయలు కేటాయించిందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

**3.** **సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని పోలీసులకు హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు.**

**4.** **రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**5.** **పారిశ్రామిక రంగంలో విజయవాడకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు**

===========================

వచ్చే రెండేళ్లలో రాష్ట్రాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో పార్కుల ఆధునీకరణకు ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విదేశాల్లో అధ్యయనం చేసిన తర్వాతే వ్యర్థాల నిర్వహణపై ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటుచేశామని.. త్వరలోనే నెల్లూరు, కాకినాడ, రాజమహేంద్రవరంతో పాటు రాయలసీమలోని రెండు ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేస్తామని నారాయణ వెల్లడిస్తూ..

.....వాయిస్.... 28 సెకన్లు....

--------------------------

క్రైస్తవ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్ల రూపాయలు కేటాయించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని సెయింట్ జాన్స్ సి.ఎస్.ఐ చర్చి ప్రాంగణంలో సండే స్కూల్ నూతన భవనానికి ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జెరుసలేం యాత్రకు, విదేశీ విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వ సహకారాన్ని క్రైస్తవ సోదరులు సద్వినియోగం

చేసుకోవాలని, అందుకు తన వంతు సహాయ సహకారం అందిస్తానని పార్థసారథి తెలిపారు.

---------------------------

ఇటీవల కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని పోలీసులకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో డిజిటల్ సాక్ష్యాల ప్రాముఖ్యతపై విజయవాడలో నిన్న రాష్ట్రస్థాయి కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి అనిత ప్రస్తుతం న్యాయవ్యవస్థలో మహిళలు ఎక్కువ మంది ఉండటం శుభపరిణామమని తెలిపారు. పోలీసు, న్యాయవ్యవస్థల సమన్వయంతో చాలా కేసులు ఛేదించవచ్చని హోంమంత్రి వివరిస్తూ..

...వాయిస్..30 సెకన్లు

---------------------------

రోడ్డు ప్రమాదాల్లో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్టీవో కార్యాలయంలో నిన్న నిర్వహించిన 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రవాణా శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

హైదరాబాద్‌కు దీటుగా పారిశ్రామికంగా అన్ని రంగాల్లో ముందున్న విజయవాడకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం ఆలోచిద్దామంటూ ఆటోమొబైల్ పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫెసిలిటేట్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ సెంటర్‌ను శివనాథ్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త ఉండాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమని తెలిపారు. ఆ ఆశయ సాధన కోసం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా 32 గ్రామాలను దత్తత తీసుకున్నానని శివనాథ్ ప్రకటించారు.

---------------------------

పీఎం సూర్య ఘర్ రుణాల మంజూరును వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈ విషయంలో వెండర్లు, బ్యాంకర్ల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 72 వేల రిజిస్ట్రేషన్లు నమోదైన నేపథ్యంలో ఇన్‌స్టాలేషన్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులు, వెండర్లు, బ్యాంకర్లతో కలెక్టర్ నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆదర్శ సౌర గ్రామాలుగా ఎంపిక చేసిన బూదవాడ, షేర్ మహ్మద్‌పేట, పరిటాల, వెల్వడం, కంభంపాడులలో సౌర ఫలకాల ఏర్పాటుపై దృష్టి పెట్టి, నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024 సంవత్సరం డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం మార్చి 24వ తేదీకి వారం రోజుల ముందు ఈ ప్రచార కార్యక్రమం పూర్తికానుంది. ఇందులో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది.

----------------------------

విశాఖపట్నంలోని కస్టమ్స్ విభాగం ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకు 11 వేల 198 కోట్ల రూపాయల ఆదాయం అందించిందని చీఫ్ కమిషనర్ సంజయ్ వెల్లడించారు. విశాఖపట్నంలో నిన్న నిర్వహించిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం 15 వేల 167 కోట్ల రూపాయల ఆదాయం సాధించామని తెలిపారు. విశాఖపట్నం, గంగవరం పోర్టులతో పాటు విశాఖపట్నం కంటెయినర్ టెర్మినల్, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం, కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ల ద్వారా అధిక ఆదాయం వస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ, ఎగుమతి, దిగుమతిదారులకు అనుకూలమైన విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....18 సెకన్లు....

----------------------------

అలనాటి నటి, నిర్మాత కృష్ణవేణి ఈ ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె వయస్సు 102 సంవత్సరాలు. ఎన్టీరామారావు, ఘంటసాల వెంకటేశ్వరరావు, గాయని పి.లీల వంటి ఎంతోమంది ప్రముఖులను 'మనదేశం' సినిమాతో ఆమె తెలుగు తెరకు పరిచయం చేశారు. ఆ సినిమాకు ఓ వైపు నిర్మాతగా వ్యవహరిస్తూనే ఎన్టీఆర్‌కు జోడీగా కృష్ణవేణి నటించారు. ఆమె మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సహా పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సినీ పరిశ్రమకు ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

====================